క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన

పాలకొండ: పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు శనివారం ఉదయం పరిశీలించారు. పలు వార్డుల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని ప్రజలను కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. రహదారులపై ఆవులు, గొర్రెలు, మేకలను కట్టరాదని సూచించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: కొద్ది రోజుల కిందట ఆడలి వ్యూ పాయింట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్లంగూడకు చెందిన సవర రెల్లయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సవర రాము, అబ్బాస్, వెంకీ, తదితరులున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో ఎరువు తయారు చేయండి



సంతోషపురం ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రం)ల్లో ఎరువు తయారు చేసి, వాటిని సబ్సిడీపై రైతులకు ఇచ్చి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. మండలంలోని సంతోషపురం, పెదగుడబ పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఆమె శనివారం సందర్శించారు. ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తాచెదారాన్ని ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించి, వర్మీకంపోస్ట్(ఎరువు) తయారు చేయాలన్నారు. ఆమె వెంట ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు

సీతంపేట: ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలియజేయాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న బహుజన సంఘాలు బలపరిచిన పోతల దుర్గారావు కోరారు. ఈ మేరకు స్థానిక బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు తెలియజేయాలని కోరారు.

80 లీటర్ల సారా, ఆటో సీజ్



సీజ్ చేసిన ఆటో, సారా క్యాన్లతో ఎక్సైజ్ సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని సింగన్నవలస కూడలి వద్ద ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం చేపట్టిన తనిఖీల్లో సారా తరలిస్తున్న ఆటో పట్టుబడింది. ఈ సందర్భంగా నిందితుడు సీతంపేట మండలం జెక్కడుగూడకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె. సూర్యకుమారి తెలిపారు. 80 లీటర్ల సారాతో పాటు ఆటో సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో మొబైల్ సీఐ పి.మురళీధర్, ఎస్సైలు తిరుపతిరావు, ఫణీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

పసుకుడిలో పారిశుధ్య పనులు



చెత్త తరలిస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని పసుకుడిలో సర్పంచ్ బివరా భార్గవనాయుడు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిధ్య పనులు కొనసాగుతున్నాయి. కార్యదర్శి కలిశెట్టి సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో వీధుల్లోని చెత్తాచెదారాలను శనివారం తొలగించారు. మురుగు కాలువలను కూడా శుభ్రం చేశారు.

బ్యాగ్ బరువు తగ్గేదెప్పుడో..



- కంప్యూటర్ కాలంలోనూ విద్యార్థులకు తప్పని కష్టాలు
- వయసుకు మించిన బరువు
- చిన్నారులకు అనారోగ్య సమస్యలు

వీరఘట్టం:

ప్రతి శనివారం బ్యాగ్ మోత లేకుండా (నో బ్యాగ్ డే) విద్యార్థులకు ఆటపాటలతో కూడిన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అయితే ఈ ప్రకటన ఇంతవరకు అమల్లోకి రాలేదు. నేటి కంప్యూటర్ల కాలంలోనూ విద్యార్థులకు బ్యాగ్ బరువుల మోత తప్పడం లేదు. ఆధునిక బోధన విధానంలోనూ చిన్నారులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడడం లేదన్నమ విమర్శలు వినిపిస్తున్నాయి. ఉల్లాసాన్నిచ్చే క్రీడలు.. ఉత్సాహాన్నిచ్చే వాతావరణం పాఠశాలల్లో కనిపించడం లేదు. కేంద్ర విద్యాశాఖ సైతం ఈ వాస్తవాలను ఒప్పుకుంది. చిన్నారులను బరువుల మోత నుంచి బయట పడేయాలని సూచనలు చేసినప్పటికీ, ఎక్కడా అమలు కావడం లేదు.

ఆందోళనలో చిన్నారుల పరిస్థితి..

కేంద్ర విద్యాశాఖ అధ్యయనం ప్రకారం 70 శాతం మంది విద్యార్థులు పుస్తకాల బరువుతో అనారోగ్యం పాలవుతున్నారు. కండరాలు, మోకాళ్లపై ఒత్తిడి పడుతోంది. 22 శాతం మందిని వెన్నెముక నొప్పి వెంటాడుతోంది. అతి చిన్న వయసులోనే నీరసం, భుజాలు వంగి పోవడం సర్వ సాధారణమైంది. 90 శాతం మందికి ఏడు గంటల నిద్ర కరువే. దీంతో తరగతి గదిలో చురుకుదనం తగ్గుతోంది. బహుళ అంతస్తు భవనాల్లో ప్రైవేట్ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. దీంతో బరువైన బ్యాగ్‌లతో మెట్లు ఎక్కడానికి చిన్నారులు పడరాని పాట్లు పడుతున్నారు.



బరువైన బ్యాగులతో స్కూల్ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు (ఫైల్)

భుజాలు నొప్పి..

రోజూ 30 పుస్తకాలను స్కూల్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, వర్క్‌ షీట్స్, నోట్‌బుక్స్ తప్పనిసరిగా ఉంటాయి. లంచ్ బాక్స్, నీళ్ల బాటిల్ అన్నీ బ్యాగులో ఉంటాయి. ఇంటి నుంచి బస్సు వరకు బరువుగా ఉండే స్కూల్ బ్యాగ్ వేసుకొని బస్సు ఎక్కాలి. ఆ టైమ్‌లో భుజాలు నొప్పిగా ఉంటాయి.

– డి. షమీజ్, 3వ తరగతి, వీరఘట్టం

పేరుకే నిబంధనలు..

పుస్తకాల బరువుపై కేంద్ర విద్యాశాఖ ఐదేళ్ల కిందటే హెచ్చరించింది. చిన్న పిల్లల బరువులో పది శాతమే పుస్తకాల బరువు ఉండాలి. ఇలాంటి పరిస్థితి మరే దేశంలోనూ లేదని బరువుపై అధ్యయనం చేసి యశ్‌పాల్ కమిటీ చెప్పింది. అధిక బరువుల వల్ల కండరాలపై ఒత్తిడి పడి భవిష్యత్‌లో దీర్ఘకాల సమస్యలు వెంటాడుతున్నాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. డిజిటల్ బోధన మేలని సూచించినా అటువైపు అడుగులు పడడం లేదు.

మానసిక ఉల్లాసం ముఖ్యం..



చదువుతో పాటు చిన్నారుల్లో మానసిక ఉల్లాసం పెంచాలి. అప్పుడే వారిలో ఆలోచన శక్తి వస్తుంది. ప్రభుత్వ స్కూళ్లల్లో తక్కువ పుస్తకాలతో బోధన ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్ల ఇష్టానుసారం పుస్తకాలు సిఫార్సు చేస్తున్నాయి. ఈ విధానంలో మార్పు రావాలి.

–డాక్టర్ రవీంద్రకుమార్, చిన్నపిల్లల వైద్యనిపుణుడు, పాలకొండ

బరువు తగ్గించాల్సిందే



పుస్తకాల బరువు వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బోధన విధానంలో ప్రపంచ వ్యాప్తంగా మార్పులు వస్తున్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో అధిక బరువుల మోతను అరికట్టే యంత్రాంగం ఉండాలి. దీనివల్ల జరిగే నష్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

– మజ్జి పైడిరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యాదర్శి

1/70 చట్టంపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. కురుపాం మండలంలోని పోరాండంగూడలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.లింగరాజు ఆధ్వర్యంలో గిరిజనులతో శనివారం సమావేశమైన ఆయన.. విశాఖపట్నంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే 1/70 చట్టం సవరించాలంటూ స్పీకరు అయ్యన్నపాత్రుడు ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తోందన్నారు. 1/70 చట్టాన్ని సవరిస్తే గిరిజనులకు భూములు దక్కకుండా పోతాయని, ఏజెన్సీలో లభించే సహజ వనరులు కార్పొరేట్ శక్తుల పాలవుతుందన్నారు. పోరాటాల ఫలితంగా గిరిజనులు సాధించుకున్న చట్టాల సవరణకు ఒడిగడితే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పీకరు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, ఎం.సింగన్న, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్న

కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగదీష్, తదితరులంతా వ్యాధి లక్షణాలు, చికిత్స, వ్యాధి బారినపడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం ఉండడం, చెవులపై బొడిపెలు రావడం, కనుబొమ్మలు, రెప్పలపై వెంట్రుకలు రాలడం, ముక్కు నుంచి రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చేతి, కాళ్ల వేళ్లు వంకరలుగా తిరగడం, తిమ్మిర్లు అధికంగా రావడం, చల్లని, వేడి వస్తువలను గుర్తించకపోవడం వంటి వ్యాధి లక్షణాలు అని, అవి కనిపిస్తే వైద్యులను సకాలంలో సంప్రదించి, చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో ఎం.బలరాంనాయుడు, సీహెచ్‌వో హైమావతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో నినాదాలు చేస్తూ అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కొమరాడ: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు అన్నారు. మండలంలోని పూడేసు గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఐఆర్‌పీడబ్ల్యూఏ, పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం వంద మందికి దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ వి.శ్రీహరి, ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న ఉత్కంఠ

- నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక రేపు

పాలకొండ: నగర పంచాయతీ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో అంతటా ఈ ఎన్నికపైనే చర్చ సాగుతోంది. వాస్తవానికి చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి (19వ వార్డు కౌన్సిలర్) ఇటీవల రాజీనామా చేశారు. ముందుగా 19వ వార్డు కౌన్సిలర్ స్థానానికి ఎన్నిక నిర్వహించిన తర్వాతే చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని నిపుణులు చెబుతున్నారు. అయితే అధికారులు ఈ వార్డులో ఎన్నిక చేపట్టకుండానే చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించాలని ఏర్పాట్లు చేయడం విశేషం. చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వేషన్ కావడంతో ఆ సామాజికవర్గానికి చెందిన కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి ఒక్కరే ఉన్నారు. అయితే ప్రస్తుత కౌన్సిలర్లు ఆమెను ఎన్నుకునేందుకు ఆశక్తి కనబడడం లేదని తెలుస్తోంది. మరో వైపు 20 వార్డుల్లో 17 మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీకి చెందినవారే. మల్లీశ్వరి కూడా వైఎస్సార్‌సీపీ నుంచే గెలిచి ఇటీవల టీడీపీలో చేరారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన వైస్ చైర్మన్ పల్లా ప్రతిప్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్నిక ఎలా నిర్వహిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కౌన్సిలర్లతో మంతనాలు చేస్తున్నారు. పార్టీ తీసుకునే నిర్ణయం మేరకు వీరు ఎన్నికకు వెళ్లాలా, వద్దా అనేది తేలుతుంది. మరోవైపు టీడీపీ నాయకులు మల్లీశ్వరిని చైర్‌పర్సన్ చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ ఉత్కంఠ వీడాలంటే ఒక రోజు వేచి ఉండాల్సిందే.



నగర పంచాయతీ కార్యాలయం

ఏసు మార్గం అనుసరణీయం

సీతంపేట: ఏసు మార్గం అనుసరణీయమని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని గజిలిలో శనివారం నిర్వహించిన క్రిస్టియన్ షోర ఉజ్జీవన మహాసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏసు కృపకు అందరూ పాత్రులుకావాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కళావతికి నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



విత్తనాల ప్యాకెట్లు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామంలో రైతులకు రాయితీపై నువ్వుల విత్తనాలు జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తోందన్నారు. టిల్-1 రకం నువ్వుల విత్తనాలు ప్రస్తుతం అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.నిర్మలాజ్యోతి పాల్గొన్నారు.

సత్వరమే వినతుల పరిష్కారం



సచివాలయంలో వినతులు పరిశీలిస్తున్న డీటీ సన్యాసిరావు

పాలకొండ: రెవెన్యూ సదస్సుల్లో అందిన వినతులను సత్వరమే పరిష్కరించాలని రీ సర్వే డీటీ పి.సన్యాసిరావు ఆదేశించారు. మండలంలోని కొండాపురం సచివాలయాన్ని శనివారం సందర్శించి, రీ సర్వే వినతులను పరిశీలించారు. ఇంతవరకు 79 వినతులు రాగా.. 49 మాత్రమే పరిష్కారమయ్యాయని సిబ్బంది చెప్పారు. మరో రెండు రోజుల్లో శతశాతం పూర్తి చేయాలని డీటీ సూచించారు. ముందుగా పాస్ పుస్తకాల్లో పేర్లు, ఫోన్ నంబర్ల మార్పులు చేపట్టాలన్నారు.

ప్రమాదకర మలుపు



ప్రమాదాలు జరిగే మలుపు ఇదే..

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ నుంచి తంపటాపల్లి గ్రామాల మధ్య ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఇరువైపులా మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపు వద్ద స్పీడ్‌బ్రేకర్లు గాని, హెచ్చరిక బోర్డులు గాని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పట్టపగలే విద్యుత్ కాంతులు..



సీతంపేట మండలంలోని బర్న గ్రామంలో వీధి లైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. కొద్ది రోజుల కిందట విద్యుత్ స్తంభాలు మార్చారు. కనెక్షన్లు కలిసిపోవడంతో వీధి లైట్లు పగలూ, రాత్రి వెలుగుతున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ వృథాను అరికట్టాలని సర్పంచ్ సుమలత, తదితరులు కోరుతున్నారు.

– సీతంపేట

రాగి లడ్డూలు, పులిహోర వితరణ..



సీతంపేట మండలంలోని బర్న గ్రామంలో వీధిలైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. కొద్ది రోజుల కిందట విద్యుత్ స్తంభాలు మార్చారు. కనెక్షన్లు కలిసిపోవడంతో వీధి లైట్లు పగలూ, రాత్రి వెలుగుతున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ వృథాను అరికట్టాలని సర్పంచ్ సుమలత, తదితరులు కోరుతున్నారు.

– సీతంపేట

ఊరందరికీ ఒకేచోట పింఛన్లు..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించేవారు. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ రద్దు కావడంతో సచివాలయ సిబ్బంది వారికి నచ్చినట్లుగా పింఛన్లు అందజేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్లకు వెళ్లకుండా లబ్ధిదారులందరినీ ఒకేచోటుకు పిలిచి పింఛన్లు అందజేస్తున్నారు. మండలంలోని తలవరంలో శనివారం ఇదే తంతు కనిపించింది. ఇదేమని అడిగితే సిగ్నల్స్ లేవనే కారణం చెప్పడం విశేషం.

– వీరఘట్టం

ముందస్తు తీర్మానాలు అంగీకరించం..

- స్పష్టం చేసిన ఎంపీటీసీ సభ్యులు

పాలకొండ: మండల పరిషత్‌కు సంబంధించి ఎంపీపీ బొమ్మాళి భాను చేపట్టిన ముందస్తు తీర్మానాలను అంగీకరించమని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ విజయరంగారావులను శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. మెజారీ సభ్యులుగా ఉన్న తమ విశ్వసం కోల్పోయిన ఎంపీపీ తీర్మానాలను అంగీకరించబోమన్నారు. పంచాయతీరాజ్ చట్టం 1994–సబ్ క్లాజ్ అనుసరించి విశ్వాసం కోల్పోయిన అధ్యక్షులు చేపట్టిన పాలనాపరమైన ఎటువంటి తీర్మానాలు చెల్లవని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యులు కోట అజయ్‌బాబు, పిన్నింటి లక్ష్మి, నిమ్మక దుర్గమ్మ, పాండ్రంకి హైమావతి, వారాడ సరస్వతి, కనపాక చిన్నమ్మలు, కో ఆప్షన్ సభ్యుడు నేపాకుల మురళీధర్ ఉన్నారు.



ఎంపీడీఓకు ఫిర్యాదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు

అంతర పంటలతో అదనపు ఆదాయం

గుమ్మలక్ష్మీపురం: ప్రధాన పంటలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూరడంతో పాటు భూసారం కూడా పెరుగుతుందని జట్టు ట్రస్టు కో–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నూకంనాయుడు అన్నారు. మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో పువ్వల ఆశమ్మ అనే మహిళా రైతు తన మామిడి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న క్యారెట్, ముల్లంగి, పాలకూర, గోంగూర, మెంతికూర, చిక్కుడు, టమాటా, వంగ, మిరప, క్యాబేజి పంటలను ఆయన శనివారం పరిశీలించారు. పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తే ఏడాది పొడవునా పంటలు పండించుకుని మంచి ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. రైతులంతా ప్రకృతి సేద్యం వైపు మరలాలన్నారు. ప్రధాన పంటతో పాటు అంతర పంటలను సాగు చేయాలన్నారు. ఆయన వెంట జీవ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మామిడి తోటలో పండిస్తున్న అంతర పంటలను పరిశీలిస్తున్న జట్టు ట్రస్టు కో–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నూకంనాయుడు

ఆన్ జాబ్ ట్రైనింగ్‌కు భద్రగిరి విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: ఆన్ జాబ్ ట్రైనింగ్ నిమిత్తం నెల్లూరు జిల్లాలోని సోమ ఇనిస్టిట్యూట్‌కు మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ విద్యార్థులను పంపించినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎలక్ట్రికల్ ట్రేడ్‌కు చెందిన విద్యార్థులు వెళ్లారని, వారికి 3 నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందుతున్నారన్నారు.



నెల్లూరులో భద్రగిరి ఆర్‌ఐటీఐ విద్యార్థులు